క్లుప్తంగా

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ డీఈఈ శ్రీనివాసులు

మిడుతూరు: బోరుబావులు ఉన్న రైతులకు విద్యుత్ సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ డీఈఈ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలపరిధిలోని రోళ్లపాడు విద్యుత్ ఉపకేంద్రం ఆవరణలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం అందజేస్తున్న వ్యవసాయ రంగానికి అందిస్తున్న 9 గంటల విద్యుత్ సరఫరా సరిపోతుందా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎవైనా సమస్యలు ఉంటే ఫోన్ లేక ఫిర్యాదు రూపంలో తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ క్రాంతికుమార్, ఉపకేంద్రంలో పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలి

పాములపాడు: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించి వారిని సంతృప్తి పరచాలని ఎంపీడీఓ గోపీ కృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులచే జగనన్న సురక్షపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో ప్రజలకు అందే సేవల్లో ఎక్కడ నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ప్రజలకు అందజేయాల్సిన పత్రాలను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసి, అర్హులై ఉంది పథకాలు అందని వారి వివరాలు సేకరించాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

25న ఉచిత వైద్యశిబిరం

మహానంది: బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామంలో ఈ నెల 25వ తేదీన జెడ్పీ పాఠశాల వద్ద ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు గుండె వ్యాధి నిపుణులు జహంగీర్ బాషా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇండస్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్, హార్ సెల్ఫ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్యశిబిరానికి ముఖ్య అతిథిగా నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ హాజరవుతారన్నారు. ఊపిరితిత్తులు, కిడ్నీలు, గుండె, ఎముకల వ్యాధుల శస్త్రచికిత్స నిపుణులు కూడా వస్తారని, ఈ వైద్యశిబిరాన్ని సమీప గ్రామాల ప్రజలు వినియోగించుకోవాని కోరారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



విద్యార్థులతో ఎంపీపీ, ఉపాధ్యాయులు

వెలుగోడు: పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతి భ కనబరిచిన పలువురు విద్యార్థులను సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు షంషీర్ అలీ, ఎంఈఓ బ్రహ్మం నాయక్, జెడ్పీ హై స్కూల్ హెచ్ఎం హెచ్. సత్యనారాయణ, మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

బెల్లం ఊట ధ్వంసం

ఆత్మకూరు: మండలంలోని ఇందిరేశ్వరం గ్రామంలో 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ నాయుడు తెలిపారు. బుధవారం సిబ్బందితో అటవీ ప్రాంతంలో నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 400 లీటరల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి నిందితుడు గుల్ల నాగన్నను అరెస్టు చేశారు.

అలరించిన భజన



భజన నిర్వహిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళావేదికపై మహబూబ్‌నగర్ జిల్లా కవాయిపల్లికి చెందిన మడపతి శివకుమార్ బృందం వారిచే నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది. కార్యక్రమంలో గణపతి పాట, అంబపరమేశ్వరి, హరహర శంకర, ఓం నమఃశివాయ, శంభో శివ శంభో, శ్రీశైలం శివమయం మొదలైన పలు భక్తి గీతాలు, అష్టకాలను శివకుమార్, కృష్ణయ్య, వెంకటయ్య, నరశింహులు, బాలశేఖర్, వెంకట్రాములు, సత్యయ్య, శ్రీను, నాగయ్య, సత్యయ్య, రాజు తదితరులు ఆలపించారు.

28న సర్వసభ్య సమావేశం

మహానంది: ఈ నెల 28న బండిఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు నివేదికలతో హాజరుకావాలన్నారు.

పాడి రైతులకు అండగా..

- రాజన్న పశువైద్య కేంద్రాల ఏర్పాటు
- గ్రామాల్లోనే ఆర్బీకేల ద్వారా పశువులకు వైద్య సేవలు
- తప్పిన వ్యయ ప్రయాసలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు



నందికొట్కూరు: పచ్చని పైరున్న ప్రతి రైతుకూ పాడి పరిశ్రమ అదనపు ఆదాయమే. పాడిపంటలు బాగుంటే పల్లెలన్నీ సుభిక్షంగా ఉంటాయి. పాడి పశువులకు జబ్బులు వస్తే గత ప్రభుత్వ హయంలో పశు వైద్య కేంద్రాలకు ఆదరాబాదరాగా రైతులు పరుగులు పెట్టేవాళ్లు. చివరికి అక్కడ వైద్య సేవలు అందకపోతే విస్తుపోవాల్సిన పరిస్థితి ఉండేది. కొన్ని సందర్భాల్లో జీవాల మరణించాయి కూడా ఉన్నాయి. ఇప్పుడా ఆరోజులు పోయాయి. గ్రామంలోనే వైద్యం అందించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రాజన్న పశువైద్య కేంద్రాలు ఏర్పాటు చేసి పశువైద్య మరింత చేరువ చేశారు.

నందికొట్కూరు నియోజకవర్గంలో పాడిపశువుల వివరాలు				
మండలం	ఆవులు	బర్రెలు	గొర్రెలు	మేకలు
నందికొట్కూరు	4,396	5,073	45,987	3,816
మిడుతూరు	3,708	5,930	41,225	2,472
పగిడ్యాల	2,845	3,612	32,845	1,642
జూపాడుబంగ్లా	3,721	6,843	39,673	4,123
పాములపాడు	3,577	8,484	31,023	7,438
కొత్తపల్లి	3,129	5,681	25,593	5,231
నియోజకవర్గంలోని రైతు భరోసా కేంద్రాలు – 72				

గ్రామాల్లోనే చికిత్సలు, రైతులకు సలహాలు

గ్రామీణ ప్రాంతాల్లో పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాజన్న పశువైద్య కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. వీటిని రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా ఏర్పాటు చేసింది. నందికొట్కూరు నియోజకవర్గంలో 72 ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం నియమించిన పశుసంవర్ధక శాఖ సహాయకుల ద్వారా సేవలందిస్తున్నారు. ఇందులో పాడిపశువులు, గొర్రెలు, మేకలకు ప్రథమ చికిత్సలు అందిస్తారు. పాడిపరిశ్రమ అభివృద్ధి చెందే విధంగా రైతులకు అవగాహన కలిప్తారు. నట్టల నివారణ మందు, వ్యాధి నిరోధక టీకాలు, వ్యాక్సిన్లు, కృత్రిమ గర్భధారణ, దూడల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.



మిడుతూరు మండలం నాగలూటి రైతు భరోసా కేంద్రం

సంచార వైద్యసేవ ద్వారా ముంగిటకే పశు వైద్యం

సంచార పశువైద్యశాలలను ఏర్పాటు చేసి పశుపోషకుల గుమ్మం వద్దకే పశువైద్య సేవలు అందిస్తున్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేస్తే మారుమాల గ్రామాలైనా సరే సంచార పశువైద్యవాహనం అక్కడికి చేరుకొని, సిబ్బంది జీవాలకు వైద్యం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

రైతులకు గ్రామంలోనే మెరుగైన సేవలు



గతంలో రైతులు మండల కేంద్రాలకు పశువులను తీసుకెళ్లేవారు. లేకపోతే ఐదారు పంచాయతీలకు కలిపి ఒక పశువైద్యశాల ఉండేది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కేంద్రాల్లోనే పాడిపశువులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. ఇలాంటి సేవలు అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. – **మంగమ్మ వీరాపురం గ్రామం, కొత్తపల్లి మండలం**

మండల కేంద్రాలకు వెళ్లాల్సిన బాధ తప్పింది



గ్రామస్థాయిలోనే రైతులకు ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా పాడి రైతులకు సేవలు అందిస్తున్నారు. మండల కేంద్రాల్లోని పశు వైద్య కేంద్రాలకు తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇప్పుడు సొంత ఊర్లనే రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి పశువులకు వైద్యం చేయించుకుంటున్నాం. సీఎం జగనన్నకు ఎప్పుడు రుణపడి ఉంటాం. – **కుర్వ రమణమ్మ, పాములపాడు మండలం**

సబ్సిడీపై పశుగ్రాసం

ప్రభుత్వం పాడి రైతులకు పశుసంవర్ధక శాఖ ద్వారా సబ్సిడీపై పశుగ్రాసం, దాణా, గడ్డివిత్తనాలు అందిస్తోంది. వైఎస్సార్ పశు నష్టపరిహార (పశు బీమా) పథకాన్ని అమలు చేసి పాడి రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తోంది. ఈ పథకంలో భాగంగా ప్రతి పశువుకు ఇవాఫ్ ట్యాగింగ్ చేసి చెవి పోగులు వేస్తారు.

ఈఓపీఆర్డీగా శ్రీనివాసులు నాయుడు

పాములపాడు: పాములపాడు ఈఓపీఆర్డీగా శ్రీనివాసులు నాయుడు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కొత్తపల్లి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న సుమిత్రమ్మ ఎంపీడీఓగా పదోన్నతి పొంది వైఎస్సార్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

హైవే కోసం 291.30 ఎకరాల సేకరణ

కొత్తపల్లి: మండలంలో నిర్మించబోతున్న జాతీయ రహదారి 167 కేకు 291.30 ఎకరాల భూమిని సేకరించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పెద్దన్న బుధవారం తెలిపారు. మండలంలో సిద్దేశ్వరం-39.89 ఎకరాలు, ఎర్రమఠం-48.61, ముసలిమడుగు-25.33, గుమ్మడాపురం-48.41, శివపురం-8.99, గోకవరం-48.79, దుద్యాల గ్రామాలలో 71.30 ఎకరాలలో భూమిని సేకరించినట్లు వివరించారు. జాతీయ రహదారి నిర్మాణానికి 3 డీ పబ్లికేషన్ పూర్తిఅయ్యిందన్నారు. సేకరించిన భూమిలో చెట్లు, బావులు, బోర్లు, వ్యక్తులకు చెందిన కట్టడాలు ఉంటే వాటి శాఖల చెందిన అధికారులు స్వయంగా పరిశీలించి, వాటికి విలువ కట్టడడం జరుగుతుందని చెప్పారు.

రైతులను ఆదుకోవాలి

నందికొట్కూరు రూరల్ : గతేడాది ఖరీఫ్ సీజన్‌లో అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం మండల పరిధిలోని అల్లూరు గ్రామ సచివాలయం పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు రైతుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామనాయుడు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల బిల్లులు వెంటనే చెల్లించండి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ భాస్కర్‌నాయుడు

పాములపాడు: గృహ నిర్మాణ లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు వెను వెంటనే జరగాలని హౌసింగ్ పీడీ భాస్కర్ నాయుడు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఎలా ఉన్నాయి. పూర్తి అయినవి ఎన్ని, వివిధ దశల్లో ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ముందస్తు బిల్లుల చెల్లింపులు చేసి వారిని త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ గోపీ కృష్ణ, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులకు ముందస్తు చెల్లింపులు

వెలుగోడు: మండలంలో ఇంటి స్థలాలు పొంది గృహాలు కట్టుకోలేని ప్రతి లబ్ధిదారుడికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు అడ్వాన్స్ బిల్లు మంజూరు చేస్తుందని నంద్యాల జిల్లా హౌసింగ్ పీడీ విజయ భాస్కర్ నాయుడు తెలిపారు. బుధవారం పట్టణంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను తనిఖీ చేశారు. మండలంలో వివిధ దశల్లో ఉన్న గృహాలకు ముందస్తు బిల్లు చెల్లింపు కింద రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు మంజూరు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ అమానుల్లా, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో జాప్యం తగదు

మిడుతూరు: జగనన్న కాలనీలోని గృహ నిర్మాణాలల్లో జాప్యం తగదని, వేగవతంగా నిర్మాంచుకోవాలని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్ బాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహనిర్మాణాలపై మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పురోగతి లేని కాలనీల్లో లబ్ధిదారులకు చైతన్యం తీసుకరావాలని సూచించారు. ఈఓఆర్డీ ఫకృద్దీన్, ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ రమేష్, ఏపీఎం సుబ్బయ్య, ఏపీఓ జయంతి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన

వెలుగోడు: 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి అన్నారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై బుధవారం గుంతకందాలలో అవగాహన కల్పించారు. ఈ నెల23న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్నారని చెప్పారు. ఎంఎల్‌ఓ రసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు శివుడు, సుధాకర్ నాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోజేసీఎస్ కన్వీనర్, కౌన్సిలర్ సుల్తాన్ ఆధ్వర్యంలో సచివాలయాలలో గృహ సారథులు, వలంటీర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 24 నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ మేనేజర్ వెంకటేష్‌గౌడ్, ఎమ్మెల్యో హుస్సేన్ రెడ్డి, 6వ వార్డు ఇన్‌చార్జ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లను తొలగించి.. రోడ్డు క్లియర్ చేసి..



రాత్రి సమయంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న పోలీసులు

పాములపాడు: పగలైనా, రాత్రైనా సరే ఎలాంటి సమస్య నెలకొన్న ప్రజలకు ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులే. పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం పౌరుల వంతైంది. పోలీసులు కూడా స్పందించడం చర్యలు తీసుకొని పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తూ శభాష్ అనిపించుకుంటూ అందరి మన్ననలు చూరగొంటున్నారు. ఈ నెల 20న రాత్రి వీచిన గాలల వల్ల మండలంలోని యర్రగూడదరు గ్రామం వద్ద కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారి పై చెట్లు నేలకొరిగాయి. దీంతో వాహనాలు వెళ్లేందుకు ఒకింత సమస్యగా మారింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ అశోక్ తన సిబ్బందికి సమస్య వివరించి హుటా హుటిన ఆ ప్రాంతానికి సిబ్బందితో రాత్రి వెళ్లారు. పోలీసులే స్వయంగా గొడ్డళ్లు చేత బూని రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను నరికి, రోడ్డు క్లియర్‌చేసి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చేశారు.

దివ్యాంగులకు ఉపాధి పని

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న దివ్యాంగులకు కూడా ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పిస్తామని ఎంపీడీఓ మేరి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ రేష్మ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మండలంలో 153 మంది వికలాంగులు ఉండగా 50 మందికి ఇప్పటివరకు పనులు కల్పిస్తున్నామన్నారు. ఇంకా గ్రామాలలో పనికావల్సినవారు అడిగితే 100 రోజులు పనికల్పిస్తామని చెప్పారు. ఐటీడీపీ ఏపీఓ రాజునాయక్, ఈసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్లపై నీటిని పారబోసిన వారికి నోటీసులు

మిడుతూరు: మండలపరిధిలోని నాగలూటి గ్రామంలో గ్రామ రహదారుల వెంట వృథా నీటిని పారబోసిన ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం గ్రామంలో వేస్టు వాటర్‌ను విధుల వెంట పోసి కుటుంబాలకు పోలీసుల సమక్షంలో నోటీసులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇకపై రోడ్డుపై నీటిని పారబోస్తే నోటీసులు అందజేసి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొత్తపల్లిలో మోస్తరు వర్షం

కొత్తపల్లి: మండలంలో అన్ని గ్రామాలలో బుధవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. ఎర్రమఠం, ముసలిమడుగు, శివపురం, లింగాపురం, ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల,నందికుంట, గువ్వలకుంట్ల, వీరాపురం గ్రామాలతోపాటు కొత్తపల్లి మండల కేంద్రంలో వర్షం పడింది. ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉన్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

మౌలిక వసతులు కల్పించాలి

మహానంది: గాజులపల్లెలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి టి.రామచంద్రుడు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గుండంపాడు రస్తాలో 296 కుటుంబాలకు పన్నెండేళ్ల క్రితం ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. అక్కడ తాగునీరు, కరెంటు, రహదారులు ఏర్పాటు చేయాలన్నారు. ఉన్నతాధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని తహసీల్దార్ జనార్దన్‌శెట్టి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోటకొండ బాషా, మద్దిలేటి, రమణ, లాల్ హుసేన్, సరస్వతి పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



కౌలు రైతు గుర్తింపు కార్డును అందజేస్తున్న తహసీల్దార్ భారతి, సర్పంచ్ శేషన్న

పగిడ్యాల: జూలై ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో భాగంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయనున్నట్లు తహసీల్దార్ భారతి వెల్లడించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న చేతుల మీదుగా కౌలురైతు గుర్తింపు కార్డును పంపిణీ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాలలో షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు ఏర్పాటు చేసి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు. పొలాలను కౌలుకు వేసుకున్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జీరాక్స్‌తో పాటు మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను ఈ గ్రామసభల్లో అందజేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు నాగన్న, వెంకటస్వామి, నరసింహ తదితరులు ఉన్నారు.

కౌలు రైతు కార్డులతో ప్రయోజనం

మహానంది: కౌలు రైతులు తప్పనిసరిగా కౌలుకార్డులు తీసుకోవాలని, వాటి ద్వారా ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని తహసీల్దార్ జనార్దన్‌శెట్టి అన్నారు. బొల్లవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి భూములు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులు కౌలుకార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. భూమి యజమానులు సైతం కౌలుకు ఇచ్చిన రైతులకు లిఖితపూర్వకంగా రాసివ్వాలని, దీని వలన ఎవరికి ఎలాంటి నష్టం ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ జమాల్‌బీ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి పెద్ద పీట



మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదరన్‌బాషా

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి పెద్ద పీట వేశారని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదరన్‌బాషా అన్నారు. బుధవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో హజ్ యాత్రకు సబ్సిడీ ఇచ్చిన పత్రాలను ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా ముస్లింలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందన్నారు. తెలుగు దేశంలో పాలనలో కేవలం మూడు వేల మసీదులకు మాత్రమే రూ.3వేల కోట్లు ఖర్చు చేస్తే జగనన్న నాలుగేళ్ల పాలనలో ఐదు వేలకు పైగా మసీదులకు, ముస్లింల సంక్షేమానికి రూ.22 వేల కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. టీడీపీ పాలనలో ఒక్కొక్క మసీదుకు రూ.10 వేలు ఇస్తే, జగనన్న ప్రభుత్వంలో రూ.15 వేలు ఇస్తోందన్నారు. ఉర్దూకు రెండో అధికార బాషా గుర్తింపు ఇచ్చి జగనన్న చరిత్రలో నిలిచారని స్పష్టం చేశారు. హజ్ యాత్రకు వెళ్లేవారికి రూ.80 వేలను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మైనార్టీ సెల్ కన్వీనర్ అబుబక్కర్, జిల్లా అధ్యక్షుడు యూనూస్‌బాషా, కౌన్సిలర్లు షేక్ నాయబ్, హమీద్, కో ఆప్షన్ సభ్యులు గపార్, వైఎస్సార్‌సీపీ నాయకులు శాలు, రహిమాన్, సోడాబాషా తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు

జూపాడుబంగ్లా: రైతులకు నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించినట్లు తెలిస్తే దుకాణాలను సీజ్‌చేసి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏఓ కృష్ణారెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని 80బన్నూరు గ్రామంలోని పురుగు మందులు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. గడువు ముగిసిన లైసెన్స్‌లను త్వరగా రెన్యువల్ చేయించుకోవాలని దుకాణాల యజమానులకు సూచించారు. దుకాణాల వద్ద స్టాకు నిల్వలు, రేట్లకు సంబంధించిన వివరాల పట్టికను పక్కాగా ఉంచాలని, విక్రయాలకు సంబంధించి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రైతులకు అందజేస్తున్నందున రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యోగా సాధనతో ఆత్మ, పరమాత్మల అనుసంధానం



శ్రీశైలంలో యోగాసానాలు చేస్తున్న విద్యార్థులు,



బండిఆత్మకూరులో యోగాసనాలు వేస్తున్న కస్తూరిబా విద్యార్థినులు,



శ్రీశైలంలో శివతాండవం యోగాసనం వేసిన్న ఒంగోలుకు చెందిన తన్వి

శ్రీశైలంటెంపుల్: యోగా సాధన అనేది ఆత్మ, పరమాత్మల అనుసంధానినికి దోహదం చేస్తుందని శ్రీశైల ప్రభ సంపాదకులు డాక్టర్ సి.అనిల్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని బుధవారం శ్రీశైల దేవస్థానం ఘనంగా నిర్వహించింది. చంద్రవతి కల్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా అర్చకస్వాములు సంప్రదాయాన్ని అనుసరించి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం ఒంగోలుకు చెందిన చిరంజీవి రాధారమణి గణపతి ప్రార్థనకు నృత్యాన్ని ప్రదర్శించారు. అలాగే ఒంగోలుకు చెందిన తన్వి యోగా సనాలతో శివతాండవాన్ని ప్రదర్శించింది. ఒంగోలుకు చెందిన ప్రముఖ యోగా శిక్షకులు, యోగాచార్య, గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం యోగాసనాలు వేయించారు. ప్రధానార్చకులు శివప్రసాద్, ఉపప్రధానార్చకులు శివశంకరయ్య, ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు వి.రామకృష్ణ, జి.మురళీధర్‌రెడ్డి, ఏఈవో ఎం.హరిదాసు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నందికొట్కూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో, కోటా ప్రభుత్వ హైస్కూల్‌లో, ఆర్టీసీ డిపోలో, బసిరెడ్డి కళాశాలలో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు, ప్రభుత్వ హైస్కూల్ కోటా హెచ్ఎం సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటనరసయ్యగౌడు ఆధ్వర్యంలో, స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో గ్యారేజీలో డిపో మేనేజర్ మహేంద్రుడు అధ్యక్షతన యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ సిబ్బందితో యోగా గురువు బ్రహ్మం ఆసనాలు వేయించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక శిశుమందిరంలో ఆయుర్వేదిక్ డాక్టర్ విజయలక్ష్మి, అనస్థీషియా డాక్టర్ జాన్సీరాణి విద్యార్థులు, ప్రజలు, టీచర్లతో యోగాసనాలు వేయించారు. ప్రభుత్వ ఐటీఐలో ప్రిన్సిపాల్ ఎ.రవీంద్రబాబు ఆధ్వర్యంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు యోగాసనాలు చేశారు.

మహానంది: నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వెంకటరమణ తెలిపారు. తిమ్మాపురం పీహెచ్‌సీలో సిబ్బందికి యోగా ప్రాముఖ్యత వివరించి ఆసనాలు నేర్పించారు. బండిఆత్మకూరులోని కస్తూరిబా పాఠశాలలోయోగా గురువు నాగేశ్వరరావు యోగాసనాలు వేయించారు. సర్పంచ్ సంధ్య, ఎంపీడీఓ వాసుదేవగుప్త, ఆయుర్వేద వైద్యులు నాగరాజు, డాక్టర్ సవిత తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ వలంటరీ హెల్త్ అసోసియేషన్, స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా విశిష్టతను స్టార్ యూత్ అసోసియేషన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కే. ఖాదర్ వలి వివరించారు. ఎంపీపీ లాలం రమేష్ పాల్గొన్నారు.

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూలులో ప్రిన్సిపాల్ నాగరవీంద్ర, డాక్టర్లు గోకారి, గజసింహరాజులు ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు మేకల భాగ్యమ్మ, ఎంపీటీసీ రమాదేవి పాల్గొన్నారు.

మిడుతూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంఈఓ మౌలాలి అన్నారు. మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రైమరీ పాఠశాలలు, ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

పగిడ్యాల: శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరమని మండల ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి అన్నారు. లక్ష్మాపురం -1 సచివాలయంలో యోగా కార్యక్రమం నిర్వహించారు.

కొత్తపల్లి: గ్రామసచివాలయాల్లో ఎంపీడీఓ మేరి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. కొత్తపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ రేష్మ, ఈసీ శ్రీనివాసులు ఉపాధి కూలీలలతో యోగాసనాలు వేయించారు.

జూపాడుబంగ్లా: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అమృతసరోవర్ లవద్ద పొదుపు మహిళలు, విద్యార్థులు, ఉపాధికూలీలతో ఏపీఎం అంబమ్మ, ఏపీఓ గౌరీబాయి, హెచ్ఎం తిమ్మారెడ్డి యోగాసనాలు వేయించారు. మండ్లెం ఒకటోవ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఎంఎల్‌హెచ్‌పీలు గీత, బీసమ్మ గర్భిణులు, బాలింతలతో యోగా చేయించారు.



తంగడంచ వద్ద ఉపాధి కూలీల యోగాసనం



పాములపాడులో యోగా చేస్తున్న విద్యార్థులు



శ్రీశైలంలో యోగా చేయిస్తున్న శిక్షకులు



తిమ్మాపురం పీహెచ్‌సీలో యోగాసనం వేసిన డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ



నందికొట్కూరు కోర్టు ఆవరణలో యోగా చేస్తున్న జడ్జి, న్యాయవాదులు, సిబ్బంది